# విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కార్యాలయము

**పత్రికా ప్రకటన** **తేది.19.12.2018.**

## స్థానిక పోలీసుల పేరుతో ప్రజలను బెధిరించి డబ్బు వసూళ్ళకు పాల్పడుతున్న ముఠాను అదుపులోకి తీసుకున్న విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు

## *నిందితుల వద్ధ నుండి మోటారు బైక్, 3 సెల్‌ఫోన్‌లు స్వాధీనం*

విజయవాడ పోలీస్ కమీషనర్ శ్రీ సి. హెచ్.డి.తిరుమలరావు ఐపిఎస్ గారి ఆదేశాలపై కమీషనరేట్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులపై విజయవాడ కమీషనర్స్ టాస్క్‌ఫోర్సు వివిధ ప్రాంతాల్లో పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేయడం ద్వారా చట్టవ్యతిరేక మరియు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో విజయవాడ నగరంలో ప్రజలను పోలీసుల పేరుతో బెధిరించి, వారి వద్ద నుండి డబ్బులు వసూళ్ళు చేస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను ది.19.12.18న కమీషనర్స్ టాస్క్‌ఫోర్స్ ఏసిపి శ్రీ జి.రాజీవ్‌కుమార్ గారి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని, వీరి వద్ద నుండి నేరాలకు ఉపయోగించిన మోటారు బైక్ మరియు 3 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకోవడం జరిగింది. అదుపులోకి తీసుకున్న ముగ్గురు నిందితుల్లో ఇద్దరు సెంట్రల్ రిజర్వ్ ప్రొటక్షన్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) కానిస్టేబుళ్ళుగా వెల్లడైంది.

పశ్చిమగోదావరి జిల్లా, ఉంగుటూరు మండలం, పెదవెలమల్లి గ్రామానికి చెందిన తాడిశెట్టి నరేష్ కుమార్ (27) మరియు కృష్ణాజిల్లా, కలిదిండి గ్రామానికి చెందిన వల్లభనేని స్వామి (26)లు ఒకే బ్యాచ్‌కు చెందిన సిఆర్‌ఫిఎఫ్ కానిస్టేబుళ్ళు. నరేష్ జార్కండ్ రాష్ట్రంలోని 190వ బెటాలియన్ కానిస్టేబుల్‌గా మరియు స్వామి చత్తీష్‌గడ్ రాష్ట్రం 168వ బెటాలియన్ కానిస్టేబుళ్ళుగా పని చేస్తూ ప్రస్తుతం ఇద్దరు దీర్ఘకాలిక శెలవులో ఉన్నారు. సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుళ్ళుగా ఇద్దరు ఒకే బ్యాచ్‌కు చెందిన వారు కావడంతో స్నేహితులయ్యారు. గతంలో స్వామి విజయవాడ పటమటలంకలో నివాసం ఉన్నప్పుడు ఇతనికి రెడ్రోతు శ్రీనివాసరావు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. స్వామి మరియు శ్రీనివాసరావులు గతంలో రెండు పర్యాయాలు పేకాట కేసుల్లో పటమట మరియు పెనమలూరు పోలీసులకు పట్టబడటం జరిగింది. తదనంతరం స్వామి చెప్పిన ప్రకారం శ్రీనివాసరావు హైదరాబాద్‌కు మకాం మార్చి అక్కడ స్వామి స్నేహితుడైన నరేష్ ఇంటి ప్రక్కన మరో పోర్షన్‌లో అద్దెకు దిగాడు. ఈ నేపథ్యంలో నరేష్, స్వామి మరియు శ్రీనివాసరావుల మధ్య స్నేహం ఏర్పడంతో తరచూ ముగ్గురు సెల్‌ఫోన్‌లో సంభాషించుకునేవాళ్ళు. ఫోన్‌లో మాట్లాకునే సమయంలో ముగ్గురు కలసి పోలీసుల పేరుతో ప్రజలను బెధిరించడం ద్వారా సులబంగా డబ్బు సంపాదించి విలాసవంతంగా జీవించాలని అక్రమమార్గాన్ని ఎంచుకున్నారు. ముగ్గురు కలసి విజయవాడ పరిధిలో గతంలో పేకాట, కోడిపందేలు మరియు వ్యభిచారం కేసుల్లో పట్టుబడిన వారిని టార్గెట్‌గా ఎంచుకుని అటువంటి వారి సమాచారాన్ని సేకరించడం జరిగింది. అనంతరం ముగ్గురు నిందితులు విజయవాడ చేరుకుని బీసెంట్‌రోడ్డులో ఉన్న ఒక లాడ్జిలో అద్దెకు దిగారు. ఈ క్రమంలో విజయవాడ నగరంలో పటమట, పెనమలూరు, మాచవరం, సత్యనారాయణపురం, భవానీపురం ప్రాంతాల్లో గతంలో కోడి పందేలు, పేకాట మరియు వ్యభిచారం నిర్వహించిన వారి వద్దకు వెళ్ళి, స్పెషల్ పోలీసులమని చెప్పి చట్టవ్యతిరేక పనులు తిరిగి ప్రారంభించినట్లు వారిపై కేసులు పెడతామని బెధిరించి డబ్బులు వసూలు చేయడం జరిగింది. ఈ విధంగా ముగ్గురు వెళ్ళిన ప్రతిచోట బాధితులను బెధిరించి ఒకొక్కరి వద్ద నుండి రూ.10 వేల వరకు మొత్తం సుమారు రూ.1 లక్ష రూపాయాలు వసూలు చేసి ఆడబ్బుతో జల్సాలు చేశారు. ఈ క్రమంలో విజయవాడ భవానీపురం బ్యాంక్ సెంటర్‌కు చెందిన ఒక మహిళ వద్దకు వెళ్ళి వ్యభిచారం నిర్వహిస్తున్నామంటూ ఆమెను బెధిరించి డబ్బులు డిమాండ్ చేయగా, ఆమె వద్ద నగదు లేకపోవడంతో ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు ఇవ్వడం జరిగింది. జరిగిన సంఘటన గురించి బాధితురాలు ఇచ్చిన సమాచారంతో వెంటనే అప్రమత్తమైన టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా ఏర్పాటు చేసి చాకచక్యంగా వలపన్ని ముగ్గురు నిందితులను ది.19.12.18న అదుపులోకి తీసుకుని, తదుపరి దర్యాప్తు నిమిత్తం భవానీపురం పోలీసులకు అప్పగించడం జరిగింది.

ప్రజలకు భద్రత కల్పించే బాద్యతాయుతమైన ఉద్యోగంలో ఉండి ఇలాంటి నేరాలు చేయడం వలన ప్రజలకు పోలీసు వ్యవస్థపై అభద్రతా భావం ఏర్పడి నమ్మకం సన్నగిల్లుతుంది. ఇలాంటి నేరాలకు పాల్పడి అక్రమమార్గంలో డబ్బు సంపాదించాలనుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ గారు హెచ్చరించడమైనది.

--xx--